క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన



ఓటుహక్కు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దారు సుధాకర్, ఎంఈవో లక్ష్మణదొర

బాడంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను తహసీల్దారు సుధాకర్, ఎంఈవో పి.లక్ష్మణదొర సోమవారం పరిశీలించారు. మొత్తం 15 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వీరిలో 12 మంది ఆఫ్‌లైన్‌లో, మిగతా ముగ్గురు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సూచించారు.

ఓటరు జాబితా ప్రదర్శన



నోటీస్ బోర్డులో ఓటరు జాబితాను అతికిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, తదితరులు

బొబ్బిలి: స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి, షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితాను కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం ప్రదర్శించారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా వివరాలను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న దీపారాధన



రాజాం సిటీ: స్థానిక మల్లికార్జునకాలనీలోని కల్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయంలో మహిళలు చేసిన దీపారాధన ఆకట్టుకుంది. కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని, భక్తులు శివుని ఆకారంలో దీపాలు వెలిగించారు. ఆ దీపాల వెలుగులో శివుని ఆకృతి చూపరుల మదిని దోచుకుంది.

అధిక ధరకు రేషన్ విక్రయిస్తే కేసులు

బొబ్బిలిరూరల్: అధిక ధరకు రేషన్ సరుకులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఎస్ డీటీ రెడ్డి సాయికృష్ణ హెచ్చరించారు. మండలంలో ఎండీయూ వాహనాల ద్వారా చేస్తున్న రేషన్ పంపిణీని ఆయన సోమవారం పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. కిలో కందిపప్పు రూ.67, అరకిలో పంచదార రూ.17 రూపాయలకు మాత్రమే విక్రయించాలని, ఆయా ధరలకు వాటిని అమ్ముతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎండీయూ వాహనాల వద్దే రేషన్ సరుకుల ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. రేషన్ సరుకులు పక్కదారి పట్టినట్లు తేలితే లైసెన్స్‌లు రద్దు చేసి, కేసు నమోదు చేస్తామన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ ఆదినారాయణ

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ వి.ఆదినారాయణ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న లిప్, తరాల్, టెక్‌టూల్, టీపీడీ మ్యాథ్స్, అపార్ వంటి వాటిపై సమీక్షించారు. విద్యార్థులంతా బేసిక్ నాలెడ్జ్‌తో పాటు పాఠ్యాంశాలపై పట్టు, భాషానైపుణ్యం పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సీఎంవో కె.రామారావు, ఎంఈవో వై.దుర్గారావు, హెచ్ఎం ముద్దాడ రమణమ్మ పాల్గొన్నారు.



బొబ్బిలి: శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు



బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరాలయంలో అర్చకుల పూజలు



సంతకవిటి: శంకరపేట శివాలయంలో భగవంతుడిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

● కార్తీక శోభ

భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీకమాసం తొలి సోమవారం ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భగవంతుడి దర్శనానికి మందిరాల వద్దకు బారులుతీరారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని, మనసారా దైవదర్శనం చేసుకున్నారు. దీపాలు వెలిగించి శివకేశవులను భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. అన్నిచోట్ల మొదలైన కార్తీకమాస పూజలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. – బొబ్బిలి, రాజాం



రేగిడి: భక్తులతో కిక్కిరిసిన సంకిలి శివాలయం



రాజాం: సంతకవిటి మండలంలోని మందరాడ శివాలయంలో భక్తుల పూజలు



బొబ్బిలి: మండల కేంద్రంలోని దిబ్బ వీధి శివాలయానికి పోటెత్తిన భక్తులు



బొబ్బిలి రూరల్: అలజంగి శివాలయంలో భక్తుల దీపారాధన



రామభద్రపురం ఈశ్వరాలయంలో దైవదర్శనం చేసుకుంటున్న భక్తులు



రాజాంలోని గాయత్రీ కాలనీలో కాశీవిశ్వేశ్వరాలయం వద్ద భక్తుల క్యూలైన్



వంగర: బంగారువలసలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వాసును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు అరసాడ వాసును మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. మండల కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వాసు తనయుడు విశాల్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే శంబంగి ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. అంతకుముందు విశాల్ చిత్రపటానికిపూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



వినతులు స్వీకరిస్తున్న రీసర్వే మండల ఉప తహసీల్దారు రవికిరణ్

తెర్లాం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే మండల ఉప తహసీల్దారు కె.రవికిరణ్ కోరారు. మండలంలోని వెలగవలస గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. భూ సమస్యలపై రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో ఏదైనా సమస్యలు తలెత్తితే వాటిని ప్రస్తుతం నిర్వహిస్తున్న సదస్సుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయి, వీఆర్వో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి చిన్నారులకు పోటీలు

రాజాం: బాలల దినోత్సవం పురస్కరించుకుని, మండల పరిధిలోని మెంటిపేట బాలభవన్‌లో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ నిర్వాహకులు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 8న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 11న శాస్త్రీయ, జానపద సంగీత దేశభక్తి గీతాల పోటీలతో పాటు కీబోర్డు, తబలా, వీణ, మృదంగం, వయోలిన్ వంటి వాయిద్య పరికరాల ప్లేయింగ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే 12న నృత్య పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు అందివ్వడంతో పాటు పలు రాష్ట్రాల్లో జరిగే బాలభవన్ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. 1 నుంచి 3వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 4 నుంచి 7వ వతరగతి వరకు జూనియర్స్, 8 నుంచి ఇంటర్మీడియట్ వరకు సీనియర్స్ విభాగంగా పరిగణించి, పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9912949492, 9959810811, 8639220158ను సంప్రదించాలని కోరారు.

ముగ్గురికి తీవ్రగాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న ఈఎంటీ ఈశ్వరరావు

రేగిడి: మండలంలోని కుమ్మరిఅగ్రహారం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన శాసపు అంజి, టొంపల సంతు, యందవ ప్రసాద్‌లు రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కుమ్మరిఅగ్రహారం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపోయారు. ఈ దుర్ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఆ ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అప్రమత్తమై 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలట్ బి.రవికుమార్‌లు ప్రథమ చికిత్స అందజేసి, మెరుగైన వైద్యం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆధార్ అవస్థలు

రాజాం: విద్యార్థులకు ఆధార్ అవస్థలు తప్పడం లేదు. కొత్తగా చేస్తున్న అపార్ నమోదు ప్రక్రియ నిమిత్తం ఆధార్‌లోని వివరాలు సరిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పేర్లు, వాటి స్పెల్లింగ్ సరిగా లేని వారంతా కామన్ సర్వీస్ సెంటర్‌లను ఆశ్రయించి, వాటిని సరిచేసుకుంటున్నారు. గతంలో గ్రామ సచివాలయాల్లోనే ఆధార్ సేవలు లభించేవి. ప్రస్తుతం ఈ సేవలు కేవలం అక్కడక్కడ మాత్రమే లభిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు చేరుకుని ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు పడిగాపులు కాస్తున్నారు.

అక్కడ కూడా సర్వర్‌లు సరిగా పనిచేయకపోవడంతో గంటల సమయం పడుతోంది. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కేంద్రం వద్ద ప్రస్తుతం ఆధార్‌లోని వివరాల సవరణకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పోటెత్తుతున్నారు.

రుచి, శుచి కలిగి ఉండాలి



మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈవో దుర్గారావు హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించారు. విద్యార్థులకు వేడివేడిగా ఉన్నప్పుడే పదార్థాలు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు, హెచ్ఎం ముద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో చల్లా లక్ష్మణరావు సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: మండలంలో పలుచోట్ల అక్రమంగా తరలిస్తున్న 94 మద్యంసీసాలను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పక్కి గ్రామానికి చెందిన గెంబలి నరసింహమూర్తి ద్విచక్ర వాహనంపై 50 మద్యంసీసాలు తరలిస్తుండగా, అతడిని రాముడువలస వద్ద పట్టుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని బెస్త వీధికి చెందిన ముంత గౌరీశంకర్ వద్ద నుంచి మరో 44 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో అక్రమంగా తరలిస్తున్న 12 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, రంగారాయపురానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలుచేయాలి



తెర్లాం: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఫారం–1 నోటీసు ప్రదర్శిస్తున్న ఎంపీడీవో రాంబాబు



రామభద్రపురం: బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని తహసీల్దారు సులోచనరాణి ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీటీ గిరిధర్‌తో కలిసి సోమవారం బీఎల్‌వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలుపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో, కార్యాలయాల్లో గోడలపై అతికించిన రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

తెర్లాం: విజయనగరం జిల్లా స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 28వ తేదీన జరగనున్న నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు సూచించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఫారం–1 నోటీసును ప్రదర్శించారు. ఎన్నిక నియమ నిబంధనలు తెలిపే ఫారం–1 నోటీసును కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఉంచామని వారు తెలిపారు.

పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లతో సోమవారం సాయంత్రం సమావేశమైన ఆయన.. పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఈ ఎన్నికలో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పార్టీ అధిష్టానం త్వరలోనే అభ్యర్థిని ప్రకటించనుందని, అందరూ సమష్టిగా అభ్యర్థి గెలుపు కోసం పాటుపడాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సమస్యలు పరిష్కరించండి

రాజాం సిటీ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజయనగరం రూరల్ బ్రాంచి అధ్యక్షుడు బీడీపీ రమణ కోరారు. స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో రూరల్ డివిజన్ 1104 యూనియన్ విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ పాతపింఛన్ విధానం అమలు చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్‌లను డిపార్ట్‌మెంట్‌లో భాగం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ అవసరమైన పనిముట్లు సమకూర్చాలని, షిఫ్ట్ ఆపరేటర్లకు విద్యుత్ ఉద్యోగుల మాదిరిగా మెడికల్, ఈపీఎఫ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ శాఖ కార్యదర్శి జి.దేముడు, విజయనగరం సర్కిల్ అధ్యక్షుడు వంగపండు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్కిల్ సర్వే చేపట్టాలి

బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో చేపట్టనున్న స్కిల్ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో కె.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్య, సంక్షేమ సహాయకులతో సోమవారం సమావేశమైన ఆయన.. సర్వేలో తప్పులు లేకుండా చూడాలని తెలిపారు.

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు అంతర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

గ్యాస్ గొడౌన్‌లో తనిఖీలు

వంగర: స్థానిక వేంకటేశ్వరస్వామి గ్యాస్ ఏజెన్సీ గొడౌన్‌లో సివిల్ సప్లయి డీటీ పిన్నింటి రామారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వలను రికార్డుల ఆధారంగా సరిచూశారు. కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వహకులు టి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

బాడంగి: మండల కేంద్రంలో విత్తన శుద్ధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఏవో కె.శిరీష తొలుత విత్తనాలు ఏ విధంగా శుద్ధి చేసుకోవాలో రైతులకు వివరించి, అనంతరం దాని ప్రయోజనాలు వివరించారు. వరి పంట చివరి దశకు వచ్చినందున వరికోతల అనంతరం నాటుకునే మినుము, పెసలు విత్తనాలను శుద్ధి చేసుకున్న తర్వాతనే పొలాల్లో చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ



వంగర: దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటిస్తున్న సూర్యారావు

వంగర: దివ్యాంగుల విద్యపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. దివ్యాంగ విద్యార్థుల ప్రాథమిక విద్యా ప్రమాణాలు, టీఎల్ఎం, రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రౌతు లక్ష్మంనాయుడు, వై.సంగోజి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



బొబ్బిలిరూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి వెంకటరత్నం

బొబ్బిలిరూరల్/బొబ్బిలి: జీడి, మామిడి రైతులంతా తమ పంటలకు సంబంధించి, పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఉద్యాన శాఖాధికారిణి ఎస్.వెంకటరత్నం సూచించారు. ఇదే విషయమై ఆమె మండలంలోని సీహెచ్ బొడ్డవలస, వెలగవలస తదితర గ్రామాల్లోని జీడిమామిడి రైతులను సోమవారం కలిసి బీమా ప్రీమియం చెల్లింపు, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బీమా ప్రీమియం చెల్లించుకుంటే ఏదైనా ప్రకృతి విపత్తు వల్ల పంట నష్టం జరిగితే నష్టపరిహారం లభిస్తుందన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాజాం సిటీ: ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆగూరు, రాజయ్యపేట గ్రామ సచివాలయాలను సోమవారం సందర్శించిన ఆయన.. ఆయా సచివాలయాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సమయానికి విధులకు హాజరు కావాలని, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.

● పారిశుధ్య కార్మికుల ధర్నా



ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలిలోని పారిశుధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. గతంలో తమ ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో ఇప్పుడు మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని చూడడం తగదన్నారు. కొన్నేళ్ల క్రితం పాకివీధిలో తమకు ఇస్తామన్న ఇళ్లస్థలాలకు సంబంధించి, డిపాజిట్లు కూడా చెల్లించడం జరిగిందని, వాటి రశీదులు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఎస్. గోపాలం, యుగంధర్, జి.వాసు, జి.గౌరి తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

● ఊపందుకున్న వరికోతలు

రేగిడి మండల వ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. చేతికి అందివచ్చిన పంటను కోసి రైతులు కల్లాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం కూడా అనుకూలించడంతో మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లోనూ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– రేగిడి



● పోలీస్ పహారా



కార్తీకమాసం వేళ నదీతీరాల్లో పవిత్ర స్నానాలు ఆచరించే వారు లోతైన ప్రదేశానికి వెళ్లి, మృత్యువాత పడకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని, రేగిడి మండలంలోని సంకిలి గ్రామ శివాలయానికి వచ్చిన భక్తులకు అక్కడి నాగావళి నదిలో లోతైన ప్రదేశానికి వెళ్లకుండా అక్కడ కాపలాగా ఉన్న పోలీసులు సూచనలు చేశారు. ఈత రాని చాలామంది స్నానం చేస్తూ లోతులోకి చనిపోతున్నారని, అటువంటి విషాద ఘటనలు జరగకుండా ఇలా పోలీస్ పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పి.నీలావతి తెలిపారు. – రేగిడి